సగంతోనే సరిపెట్టారు!

- ప్రభుత్వం మారడంతో నిలిచిన పనులు
- పూర్తి చేయాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

రెండు వైపులా అని ఒకవైపు మాత్రమే వైట్ టాపింగ్ రోడ్డు



2017లో ఒకవైపు పూర్తిచేసిన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని వైట్‌టాపింగ్ రోడ్డు

రాయదుర్గం: వైట్ టాపింగ్ రోడ్డు రెండువైపులా అని చెప్పి ఒకవైపు అది కూడా సగమే వేసి వదిలేశారు. నానక్‌రాంగూడ ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు ఉన్న బీటీరోడ్డునే కాస్తా విస్తరించి వైట్‌టాపింగ్ రోడ్డుగా మార్చేందుకు నిర్ణయించడంతో అందరిలోనూ ఆసక్తి నెలకొంది. వచ్చే 30 ఏళ్ల వరకు ఎలాంటి సమస్యలు రాకుండా ఉండాలనే తపనతో టీఎస్ఐఐసీ సంస్థ ఈ రోడ్డు పనులను పర్యవేక్షించింది. రోడ్డు వేసే సమయంలో ఈ రోడ్డును ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ వరకు పూర్తిగా మూసి వేయడంతో ఐటీ ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అప్పట్లో గుర్రాలపై రాకపోకలు నిర్వహించి కొందరు ప్రదర్శన చేసి తమ నిరసన తెలిపారు. అలా ఇలా ఎలాగో ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ వరకు ఒకవైపే త్రీలేన్ బీటీరోడ్డును కాస్తా వైట్‌టాపింగ్ రోడ్డుగా పూర్తి చేశారు.

రూ.50 కోట్ల వ్యయంతో..

ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి ఇన్ఫోసిస్, విప్రో సంస్థ ముందు నుంచి విప్రో సర్కిల్ ద్వారా వరుణ్ మోటార్స్ నుంచి ఓఆర్‌ఆర్ వరకున్న బీటీరోడ్డును ఆరు లేన్ల వైట్ టాపింగ్‌గా మార్చాలనుకున్నారు.ఇందుకోసం రూ.50 కోట్ల వ్యయంతో ఈ వైట్‌టాపింగ్ రోడ్డు వేయాలని సంకల్పించారు.2017 సెప్టెంబర్‌లో ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి ఒకవైపు త్రీలేన్ బీటీరోడ్డును వైట్‌టాపింగ్ రోడ్డును విప్రో సర్కిల్ వరకు పూర్తి చేశారు. ఈ రోడ్డు ప్రారంభించిన తరుణంలో రెండు వైపులా రాకపోకలు నిలిపివేశారు.ఇబ్బందుల నేపథ్యంల ఒకవైపు రాకపోకలకు అనుమతించడంతో కొంత వరకు సమస్యలు తీరినట్లయింది.ఎట్టకేలకు విప్రో సర్కిల్ వరకు వైట్‌టాపింగ్ పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు. అప్పటి నుంచి మిగతా రోడ్డునే కాకుండా మరో వైపు రోడ్డు పనులను పూర్తిగా మార్చిపోయారు.

మిగిలిపోయిన రోడ్డు ఎప్పుడో..?

ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ వరకు ఒకవైపే బీటీరోడ్డు కాస్తా వైట్‌టాపింగ్ రోడ్డుగా మార్చిన దాన్ని వరుణ్‌మోటార్స్ మీదుగా ఓఆర్‌ఆర్ వరకు ఒకవైపు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విద్యుత్ సబ్ స్టేషన్, ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్ సంస్థ ముందు నుంచి విప్రో సర్కిల్ వరకు అక్కడి నుంచి ఐసీఐసీఐ బ్యాంకు ముందు నుంచి ఓఆర్‌ఆర్ రోడ్డు వరకున్న బీటీరోడ్డును ఆరు లేన్ల వైట్ టాప్ టాపింగ్ రోడ్డు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదని చాలా మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును పూర్తిస్థాయిలో చేపట్టి వచ్చే దశాబ్దాల వరకు సమస్యలు లేకుండా చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



మరో వైపు బీటీరోడ్డు

లింకురోడ్ల అభివృద్ధితో చాలా వరకు సమస్యలు తీరాయి..

నానక్‌రాంగూడ ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు రాకపోకలకు ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ మీదుగా రాకపోకలు మాత్రమే నిర్వహించాల్సి వచ్చేది. ప్రస్తుతం విప్రో సర్కిల్ నుంచి గోపన్‌పల్లి తండా వరకున్న రోడ్డును కాస్తా ఆరులేన్ల రోడ్డుగా విస్తరించడంతో మరో దారి ఏర్పడినట్లయింది. అదేవిధంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని ఐసీఐసీఐ బ్యాంకు ముందు నుంచి హయత్ హోటల్ ముందు నుంచి ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డును కలుపుతూ లింకురోడ్డు ఏర్పాటు చేయడం, విప్రో సర్కిల్ నుంచి నానక్‌రాంగూడ పురాతన రోడ్డును విస్తరించడంతో అనేక వైపులా రోడ్డు సౌకర్యం ఏర్పడి ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తీరినట్లయింది.

3 నుంచి దసరా ఉత్సవాలు

రాయదుర్గం: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని రాజరాజేశ్వరి మాతను 3న షోడశ రాజరాజేశ్వరి దేవి అలంకారం, 4న బాలాత్రిపుర సుందరి దేవి, 5న గాయత్రిదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న లలితాదేవి, 8న మహాలక్ష్మీ, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11 మహిషాసురమర్దిని దేవి, 12 రాజరాజేశ్వరి దేవి అలంకారంతో నిత్యం ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ప్రతిరోజూ ఆలయంలో అమ్మవారికి ఉదయం 6 గంటలకు కుంకుమార్చన కార్యక్రమాలు అదేవిధంగా 10.30 గంటలకు లలితా సహస్రనామ పారాయణం చేయడానికి ఏర్పాట్లు చేశారు.

పరామర్శ



రాయదుర్గం: కూల్చివేతల సమయంలో గాయపడిన హోంగార్డు గోపాల్‌ను హోంగార్డుల నాయకులు పరామర్శించారు. మంగళవారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపాల్‌ను హోంగార్డుల తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్వాల్‌దయానంద్, ఆధ్వర్యంలో పలువురు ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. హోంగార్డుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, హరిబాబు ఉన్నారు.

మంత్రి ఉత్తమ్‌ను పరామర్శించిన గాంధీ



గచ్చిబౌలి: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తం రెడ్డి మరణించిన నేపథ్యంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరామర్శించారు. మంగళవారం మసీద్‌బండలోని సైబర్‌మిడోస్‌లో పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీకాంత్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాలీబాల్ అండర్ 14 విభాగంలో త్రివేణి స్కూల్ విజేత



చందానగర్: చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో మంగళవారం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన వాలీబాల్ అండర్–14 విభాగంలో త్రివేణి స్కూల్ మియాపూర్, మదీనాగూడ బ్రాంచ్ విద్యార్థులు ప్రథమ విజేతలుగా నిలిచారు. వాలీబాల్ టీం విజేతలకు చందానగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి బహుమతులు అందజేశారు. త్రివేణి పాఠశాలల విద్యార్థులు వాలీబాల్ క్రీడల్లో ప్రథమ విజేతలుగా నిలిచినందుకు డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, సీఆర్‌ఓ సాయి నర్సింహారావు, ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, జగదీష్ బాబు, నాగరాజు, పీఈటీ వేణు అభినందించారు.

సందడిగా బతుకమ్మ వేడుకలు



గచ్చిబౌలి: కొండాపూర్‌లోని సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో మంగళవారం బతుకమ్మ వేడుకలకు ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ వస్త్రాధారణతో వచ్చిన విద్యార్థినులు, మహిళ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కలిశారు. మంగళవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో కలిసి ఆయన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేతాజీనగర్, రాయదుర్గం, నల్లగండ్ల హుడాకాలనీ, నానక్‌రామ్‌గూడలలో సీసీరోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయన్నారు. అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ నివాసముంటున్నారని, పెద్ద ఎత్తున స్థానికుల సమస్యలు తీర్చడానికి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జెడ్సీని కోరినట్లు ఆయన వివరించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గాప్రసాద్‌ను కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కలిశారు. గచ్చిబౌలి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈలు విశాలాక్షి, ఆనంద్, ఏఈ రషీద్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్ యాదవ్, ఉపాధ్యక్షుడు రాయుడు, సీనియర్ నాయకులు సుమన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

మియాపూర్: మియాపూర్‌లోని సర్వేనంబర్ 100, 101, 44 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడాలని జనంకోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..100, 101, 44 సర్వేనంబర్‌లో భూమి వందల ఎకరాల్లో ఉందని, ఈ భూమి వివాదంలో ఉందన్నారు. సుప్రీంకోర్టులో ఈ భూమిపై విచారణ జరుగుతుంది. ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని సుప్రీంకోర్టు స్టేటస్‌కో విధించింది. అయినా ఈ సర్వేనంబర్‌లోని భూములను పక్కన గల సర్వేనంబర్‌లతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని అనుమతులు తీసుకుని ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, శేరిలింగంపల్లి తహసీల్దార్లకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అదేవిధంగా మియాపూర్ బస్ డిపో వెనుకాల రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కబ్జాచేసి రూములు, ప్రహరీల నిర్మాణాలు చేపట్టారని వాటిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

విష జ్వరాలపై మరింత అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవిందర్ నాయక్

గచ్చిబౌలి: పెరుగుతున్న విష జ్వరాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవిందర్ నాయక్ డాక్టర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన కొండాపూర్ జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. వార్డులలో రోగులతో మాట్లాడి వసతులు ఏలా ఉన్నాయో ఆరా తీశారు. విష జ్వరాలు, మలేరియా, డెంగీ కేసుల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసు కున్నారు. ఆస్పత్రిలోని మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం డాక్టర్లతో సమావేశమయ్యారు. జ్వరాల సంఖ్య పెరుగుతుందని, పూర్తి స్థాయిలో అన్ని పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, జ్వరంతో వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూపరింటిండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డిని ఆయన ఆదేశించారు.

అనుమతులు లేనిదే పోస్టర్లు ప్రింటింగ్ చేయొద్దు



శానిటేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 పరిధిలో అనుమతులు లేనిదే వాల్ పోస్టర్లు, రాతలు రాయడం వంటివి చేస్తే జరిమానా విధిస్తామని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో స్థానిక ప్రింటింగ్ దుకాణాదారులు, పారిశుద్ధ్య అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇప్పటి నుంచి ప్రింటింగ్ షాప్‌లలో అనుమతులు లేనిదే పోస్టర్లు ప్రింటింగ్ చేయొద్దన్నారు. సినిమా థియేటర్ యజమానులు కూడా సినిమా పోస్టర్లు గోడలపై అతికించొద్దన్నారు. ఈ సమావేశంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, ఎస్ఎఫ్ఏలు, ఎస్ఆర్‌పీలు, ప్రింటింగ్ చేసే దుకాణాదారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యప్ప స్వాములకు అన్నదానం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ, జేఎన్‌టీయూ రోడ్డులోని పోచమ్మ తల్లి ఆలయం వద్ద ధర్మశాస్త భక్త సమాజం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు నేటి నుంచి 10 జనవరి 2025 వరకు అన్న సమారాధన నిర్వహించనున్నారు. వ్యవస్థాపకులు పూచా రాంబాబు గురుస్వామి, బీఎస్ఎస్ రాజు స్వామి, నూతి వాసు నాయుడు, నూతి రాంబాబు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్నదానం కార్యక్రమం 8 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వాములు ప్రతి రోజు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పింఛన్ మంజూరు పత్రాల అందజేత



మంజూరు పత్రాలు అందజేస్తున్న కమిషనర్

పటాన్‌చెరు టౌన్: 'ప్రయాస్ పథకం'లో భాగంగా పదవీ విరమణ పొందిన నెలలోనే చందారులకు పింఛన్ పత్రాలను మంజూరు చేస్తున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో సెప్టెంబర్ నెలలో 23 మందికి పింఛన్ మంజూరు కాగా, అందులో 13 మందికి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ .. 'ప్రయాస్' చందారులకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశ్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ కమిషనర్–2 శ్రీదేవి, విభాగ పర్యవేక్షకుడు జానకి రామారావు ఉన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు

మూసాపేట: దివ్యాంగులకు ప్రశాంత్‌నగర్ వద్ద మంగళవారం బస్‌పాస్ కౌంటర్‌ను డీఎం హరి ప్రారంభించారు. ప్రశాంత్‌నగర్ వద్ద బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు ఇటీవలే వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన ఉన్నతాధికారులను సంప్రదించి.. వారి ఆదేశాల మేరకు దివ్యాంగుల బస్ పాస్ కౌంటర్‌ను ప్రారంభించారు. సీపీఐ నాయకులతో కలిసి దివ్యాంగులకు బస్‌పాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జి.కృష్ణ, యూనిట్ సెక్రటరీ ఇక్బాల్, నాయకులు మోనోచారి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం

మోతీనగర్: అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం సంబురాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పర్వత్‌నగర్ సెక్టార్‌లో గ్రాండ్ పేరెంట్స్‌డే, అక్షరాభ్యాసం, అన్నప్రాసన, సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీడీపీఓ రేణుక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అంగన్‌వాడీ కేంద్రంలో ఎన్నో రకాల సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నదని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు పోషక ఆహార జాగ్రత్తలను సూపర్‌వైజర్ అనిత వివరించారు. 5 సంవత్సరాల పిల్లలకు బాలామృతం అందించే విధానాన్ని తెలిపారు.

జీహెచ్‌ఎంసీ కార్మికులకు వైద్య శిబిరం

కూకట్‌పల్లి: జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోన్ స్వీపర్లు, ఎంటమాలజీ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం, పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని రాజు కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఎన్ఐఎన్ అధికారులు పోషకాహారం, హైజీన్‌పై అవగాహన కల్పించారు. ఉదయం 12 గంటలకు ఈఎస్ఐ వారిచే కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎక్కువ మంది కార్మికులు మహిళలు ఉండటంతో గైనకాలజిస్టు వైద్యుల సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ కృష్ణయ్య, రమేష్ శ్రీనివాస్, ఏఎంఓహెచ్ ఉదయ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



బాక్స్‌టైప్ డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

శేరిలింగంపల్లి: రాజీవ్ గృహకల్పలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. మంగళవారం రాజీవ్ గృహకల్పలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. రాజీవ్ గృహకల్పలో ఇప్పటికే సీసీ రోడ్లు చాలా వరకు పూర్తి చేశామని, మిగిలిన రోడ్లు కూడా వేస్తామన్నారు. అంతకు ముందు స్థానికులు తెలిపిన ప్రకారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తికాగానే ఆయా పనులు చేపట్టుతామని వివరించారు. తాగునీటి పైప్‌లైన్ వేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. శానిటేషన్, వీధి దీపాలను నిర్వహణను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చేపట్టుతున్న బాక్స్ టైప్ డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, సర్కిల్ ఉప వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు శ్రీకళ, బసవయ్య, బసరాజ్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై అధికారులతో సమావేశం



అధికారులతో సమావేశమైన డీసీ రవి కుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో మంగళవారం ఉపకమిషనర్ రవి కుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా ఆస్తిపన్ను వసూలు బకాయిలపై సిబ్బంది, అధికారులతో చర్చించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. లక్ష రూపాయల నుంచి ఆపై ఎక్కువగా ఉండి ఆస్తిపన్ను చెల్లించని వారి వివరాలను ప్రతిరోజు పరిశీలించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల ఆస్తిపన్ను విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి పన్నులను వసూలు చేయాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు పాల్గొన్నారు.

చిట్కుల్ గ్రామంలో కలెక్టర్ పర్యటన

గురుకులంలో బస చేసిన అధికారులు



నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: మండలం పరిధిలోని చిట్కుల్ గ్రామంలో జిల్లా కలెక్టర్ క్రాంతి అధికారులతో కలసి పర్యటించారు. సోమవారం రాత్రి ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలలో ఆమె బస చేశారు. మంగళవారం ఉదయం అధికారులతో కలిసి చిటుకుల్ గ్రామంలోని ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, నర్సరీ, వైకుంఠధామంతో పాటు గ్రామంలోని పలు వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రం ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, చిట్కుల్ గ్రామ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



జీవీ హైట్స్ విశాల్ టవర్స్‌లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: నియోజకవర్గ అభివృద్ధిలో దాతలు భాగస్వాములవ్వడం అభినందనీయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట పార్కులో మంగళవారం భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఆర్థిక సాయంతో సీఎస్ఆర్ ఫండ్ రూ.15.35 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను, పిల్లల కోసం ఏర్పాటు చేసిన పరికరాలను కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాం మోహన్, డైరెక్టర్ ఆఫ్ కమర్షియల్ ధనులతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజ హితం కోసం ఏదో ఒక రూపంలో సేవ చేయాలని కోరారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే పెద్దలు, వృద్ధులు, పిల్లలకు ఓపెన్‌జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మరిన్ని కాలనీల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసి, ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

- వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాగ్ అమీర్‌లో జీవీ హైట్స్ విశాల్ టవర్స్‌లోని పార్కులో భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ వారు సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ని ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఎండీ రాంమోహన్‌రావు, డైరెక్టర్ ఆఫ్ కమర్షియల్ ధనులతతో కలిసి ప్రారంభించారు.

ఆశా, ఏఎన్ఎంలకు శిక్షణ



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నాన్ కమ్యూనికేబుల్ డిసీసెజ్‌పై ఆశా, ఏఎన్ఎంలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి 30 ఏళ్లు పైబడిన వారి ఆరోగ్య వివరాలను ఆభా కార్డులో నమోదు చేయాలన్నారు. సదరు వ్యక్తులకు బీపీ, షుగరు వంటి వ్యాధులు ఉన్నాయా, ఉంటే వాటి వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులు ఉన్న వారికి ప్రతి నెలా మందులు అందజేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అన్నపూర్ణ, జిల్లా కో ఆర్డినేటర్ శ్రీలత, డీడీఎం సౌజన్య, సీహెచ్‌ఓ స్వామి, పీహెచ్ఎన్ శ్యామల పాల్గొన్నారు.

మహిళ హత్యకేసులో ఇద్దరిపై అనుమానం

పోలీసుల అదుపులో అనుమానితులు

మియాపూర్: దీప్తీశ్రీనగర్, సీబీఆర్ ఎస్టేట్‌లో సోమవారం జరిగిన వివాహిత హత్య కేసులో ఇద్దరు అనుమానితులను మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అపార్ట్‌మెంట్‌లోని 110 రూమ్‌లో ఉంటున్న స్పందన(29)ను గుర్తు తెలియని వ్యక్తులు కత్తి, రాడుతో తల, ముఖంపై విచక్షణరహితంగా దాడి చేయగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయంపై తల్లి నమ్రత పోలీసులు ఫిర్యాదు మేరకు క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తిని అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సదరు వ్యక్తి మృతురాలి స్పందనకు ఇంటర్మీడియేట్ నుంచి క్లాస్‌మెట్ అని తెలుస్తుంది. దీంతో సదరు వ్యక్తితో పాటు మృతురాలి భర్తను కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం.

సందేహాల నివృత్తి కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

రాజేంద్రనగర్: మూసీ రివర్ బెడ్‌లో నిర్మాణాలు ఉండి నివాసముంటున్న ఇంటి యజమానులకు ఏదైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకునేందుకు ఆర్డీఓ కార్యాలయం, రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల పరిధిలో మొత్తం 339 నిర్మాణాలకు మార్కింగ్ వేసినట్లు తెలిపారు. ఇందులో 24 మంది నార్సింగి, జియాగూడ ప్రాంతాల్లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు వెళ్లినట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు వెళ్లదలచిన వారు ఆర్డీఓ లేదా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి

బండ్లగూడ: ప్రజలతో పాటు విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని, తమ ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా 'స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత ' అనే థీమ్‌తో మంగళవారం బండ్లగూడ వార్డు కార్యాలయంలోని ఓపెన్ పాయింట్ వద్ద శుభ్రం చేయించి ముగ్గులు వేయించారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సు విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు.

రెడ్యూస్ రీసైకిల్ సెంటర్ పరిశీలన

ర్యాలీ అనంతరం లిబ్రం విల్లా వద్ద రెడ్యూస్, రీసైకిల్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సెంటర్ అందుబాటులో ఉండి ఒక సంవత్సర కాలం అయిందని, ప్రజలు నిరూపయోగమైన వస్తువులు, దుస్తులు, పుస్తకాలు, ఆట వస్తువులు ఇక్కడ ఇస్తున్నారని తెలిపారు.